'రన్ ఫర్ జీసస్' ర్యాలీ



ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: గుడ్‌ఫ్రైడే సందర్భంగా కుషాయిగూడ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. క్రైస్తవుల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానన్నారు. ర్యాలీ నిర్వాహకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఫాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ సరిళ్ల రాజు, జ్యోతి, ఫాస్టర్ జాన్ కెనడీ, ఉదయ్, ఏసురత్నం, సుదర్శన్, శ్యామ్ బీఆర్ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేద్దాం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేద్దామని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన పీపీ-2, గ్రేడ్ -5 స్నాతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి పిల్లలే రేపటి భావి భారత పౌరులుగా ఎదిగేందుకు కృషి చేద్దామన్నారు. ఈనాటి విద్యార్థులు భవిష్యత్తులో ఒక డాక్టర్, న్యాయవాది, రాజకీయ నాయకుడిగా ఉన్నతమైన ప్రభుత్వాధికారిగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఉత్తీర్ణత, ప్రశంసాపత్రాలను అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ నాగలక్ష్మి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డాక్టర్లకు సన్మానం



బోడుప్పల్: సమాజంలో ఎంతో మందికి ప్రాణాలు పోస్తూ పునర్జన్మనిచ్చేది డాక్టర్లేనని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ఆయన పలువురు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో డాక్టర్ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైందని, వైద్యసేవలు అందించే వారిని భూలోక దేవుళ్లుగా భావిస్తారన్నారు. తమ పాఠశాలలో చదువుకుని డాక్టరైన డాక్టర్ రమ్య, డాక్టర్ ధరణి, డాక్టర్ రవితేజలను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నాటరాజ నృత్య సమితి గురువు తరంగిణి శిష్య బృందంచే కూచిపూడి నృత్యం ప్రదర్శన అలరించింది. జూమ్.. జూమ్ వినాయక కౌతం, పుష్పాంజలి, అఖిలాండేశ్వరి, క్షీరాబ్ధి కన్యకకు, అన్నమాచార్య సంకీర్తనల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో నిహారిక, మీను శ్రీ,సాయి, శ్రీనిక, రిత్విక, మాన్వింత, నేత్ర, స్మితిక, ఇశ్వింత పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



రామంతాపూర్: 15 రోజుల క్రితం కురిమిశెట్టి సత్తయ్య మృతి చెందాడు. దశదినకర్మ నిమిత్తం శనివారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యవర్గం సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సంబు కొండయ్య గుప్తా, బోనగిరి శ్రీనివాస్ గుప్తా, రమేష్ గుప్తా, శ్రవణ్‌కుమార్, నగేష్, జంగయ్య, విశ్వనాథ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో శనివారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. గ్రామ నాయకులతో కలిసి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేష్, మాజీ సర్పంచ్ మహేందర్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల రిమాండ్

మేడిపల్లి: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో ఘట్‌కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డితో పాటు మరో నలుగురు బీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హోలీ పండుగ సందర్భంగా చెంగిచర్ల పిట్టల బస్తీలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన భాధితులను పరామర్శించేందుకు వచ్చిన బండిసంజయ్‌తో పలువురు నాయకులను పోలీసులు అడ్డుకున్న వినకుండా భారీకేడ్లను తోసుకుంటూ.. ముందుకెళ్లారు. ఈ ఘటనలో పోలీసులు, నాయకులకు మధ్య జరిగిన తోపులాటలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, గాయపరిచారని నాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా శనివారం ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డితో పాటు మరో నలుగురు నాయకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

గీత దాటొద్దు..!

పార్టీలు.. నాయకులకు మార్గదర్శకాలు

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల సంఘం జారీ
- కోడ్ అమలుతో ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆదేశం



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రచార పర్వం, సభల్లో ఎన్నికల ప్రవర్తన, నియమావళిని అనుసరించి రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులకు జిల్లా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని ఖచ్చితంగా పాటించాలని సూచించింది. ప్రచారం, సభల్లో రాజకీయ పార్టీ, నాయకులు కుల, మత, భాష ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయవద్దని పేర్కొంది. ఎన్నికల ప్రచారంలో విధానాలు, పథకాలు, కార్యక్రమాలపై మాత్రమే విమర్శలుండాలని తెలిపింది.

- వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేయకూడదని పేర్కొంది. కుల, మత ప్రాతిపదికన ఓట్లు అడగడం, మందిరాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థన ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వాడుకోవద్దని నిర్ధేశించింది. ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించటం నిషేధం.
- ఒక వ్యక్తి ఓటును మరొక వ్యక్తి వేయడం చట్ట వ్యతిరేకమని తెలిపింది. సంబంధిత వ్యక్తుల అనుమతి లేనిదే వాళ్ల భూములు, భవనాలను ప్రచారానికి ఉపయోగించకూడదని పేర్కొంది. ఇతర పార్టీల ఎన్నికల ప్రచారాలు, సమావేశాలకు ఆటంకం కలిగించకూడదని, ఎన్నికల ప్రచార సమావేశాలకు పోలీసుల నుంచి ముందుగా లిఖితపూర్వకంగా అనుమతి పొందాలని సూచించింది.
- ఆంక్షలున్న ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించకూడదని తెలిపింది. ఎన్నికల సమావేశాల్లో మైక్, లౌడ్ స్పీకర్ల వినియోగానికి ముందుగా అనుమతి పొందాలని, సమావేశానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొంది.
- ఊరేగింపులు, ప్రదర్శనల రూటు మ్యాప్‌ను ముందుగానే పోలీసులకు తెలపాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించాలని సూచించింది. ఎన్నికల ప్రచారంలో ఎలాంటి దిష్టిబొమ్మల దహనం చేయరాదని పేర్కొంది. మంత్రులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించకూడదని, అధికార పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని అధికారిక పర్యటనలతో కలిపి చేయరాదని పేర్కొంది.
- అధికార యంత్రాంగాన్ని కూడా వాడుకోవద్దని సూచించింది. ప్రభుత్వ వాహనాలు వాడకూడదని పేర్కొంది. అతిథి గృహాలు అందరికీ ఇవ్వాలని, వీటిపై ఎవరి పెత్తనం ఉండొద్దని తెలిపింది. రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని వాగ్దానాలు చేయవద్దని సూచించింది. ఉద్యోగుల బదిలీలపై పూర్తి నిషేధం ఉంటుంది.
- మంత్రులు ఎన్నికల అధికారులను పిలవకూడదు. ప్రైవేటు పనిపై వచ్చిన మంత్రులను ఏ అధికారి కలవకూడదని పేర్కొంది. మంత్రులు పైలెట్ కార్లు, ఎర్రబుగ్గ కార్లు ఉపయోగించకూడదని, ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేయొద్దని తెలిపింది.
- కొత్త పనులు చేపట్టకూడదని, కొత్త పనులకు ఆమోదం తెలపకూడదని ఎన్నికల సంఘం జారీ చేసిన మర్గదర్శకాల్లో పేర్కొంది. కోడ్ అమల్లో ఉంది కాబట్టి ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని పేర్కొంది. లేని పక్షంలో ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపింది.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు, పోలింగ్ రోజు అత్యవసర సేవలు నిర్వహించే అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్, ఓటింగ్ సౌకర్యం కల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

- ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందించే దిశగా అదనపు ఫారం 12 సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన రవాణా, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్, ఆర్టీసీ, అగ్నిమాపక, ట్రాఫిక్ పోలీస్ తదితర అత్యవసర శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు.
- అత్యవసర సేవల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం రిటర్నింగ్ అధికారికి ఏప్రిల్ 23లోపు ఫారం-12డి సమర్పించాలన్నారు. మే 3 నుంచి మే 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.
- 85 సంవత్సరాల పైబడి నడవ లేని సీనియర్ సిటిజన్లు, నడవ లేని దివ్యాంగులకు, కోవిడ్ పేషెంట్లుకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఆర్ఓ హరిప్రియ, ఎలక్షన్ అధికారి రాజేశ్వర్‌రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలి



ఆస్తిపన్ను చెల్లింపు కౌంటర్‌ను పరిశీలిస్తున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో ఆస్తి పన్ను చెల్లింపు కౌంటర్‌ను డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో రూ.34 కోట్లు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.31.50 కోట్లు వసూలు చేశామని, చివరిరోజు ఆదివారం లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. చివరిరోజు ఆస్తి పన్ను బకాయిదారులందరూ సద్వినియోగం చేసుకుని పన్నులు చెల్లించాలని కోరారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆఫీస్ సూపరిండెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



గౌతంనగర్: బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కి మద్దతుగా బీజేపీ సీనియర్ నాయకులు శనివారం గౌతంనగర్ డివిజన్ ఐఎస్‌నగర్‌లో గత 40 ఏళ్లుగా బీజేపీలో పనిచేస్తున్న కార్యకర్తల ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, రాంబాబు, వాసుదేవరావు, మాజీ కౌన్సిలర్ గౌలికర్ ఆనంద్, విజయ్‌కుమార్, వెంకటేష్, పెంటయ్య తదితరులున్నారు.

భవిష్యత్‌లో మహిళలు మరింత రాణించాలి



మహిళా దినోత్సవ వేడుకల్లో పట్నం సునీతామహేందర్‌రెడ్డి

కీసర: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని కాంగ్రెస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు బొమ్మ ప్రవల్లిక ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపల్ పరిధిలోని సువర్ణ కళ్యాణ వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఎదుగుదలలో మహిళ పాత్ర ప్రముఖంగా కనిపిస్తుందన్నారు. భవిష్యత్‌లో మహిళలు మరింత రాణించాలని ఆమె అభిలాషించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ప్రముఖ సంఘ సేవకురాలు జమున రాజేందర్, పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు వనం దుశ్యాంతల, జాతీయ రాజకీయ అధ్యక్షుడు బొల్ల శివశంకర్, కోశాధికారి మిరియాల విశ్వరేఖ, ఉపాధ్యక్షులు బండారు లక్ష్మీ, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, గోగుల సరితా, మచ్చ వరలక్ష్మీ, అనంతలక్ష్మీ, ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, సామల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, సోమేష్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మున్నూరు కాపులు



మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంతో పాటు జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో మున్నూరు కాపు కుల సంఘం భవనాల నిర్మాణం కోసం అవుటర్ రింగు రోడ్డు వెంట, మండల కేంద్రాల్లో స్థలాలు కేటాయించాలని కోరుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల మున్నూరు కాపులు సీఎం రేవంత్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. నగరంలోని సీఎం నివాసానికి మండల కేంద్రాల నుంచి తరలివెళ్లి వినతి పత్రం అందజేశారు. ఐదు మండలాల అధ్యక్షులు ఆకుల సురేష్ పటేల్, చిందం మహేందర్‌పటేల్, మామిండ్ల శ్రీనివాస్, నర్సింగ్‌రావు పటేల్, భాస్కర్, కన్నా పటేల్, లక్ష్మణ్, మురళీధర్, నరేందర్, రఘురాం, రాంగోపాల్, రాంశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీలోకి కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: మేడ్చల్-మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్యనాయకులు బీజేపీలో చేరనున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం మున్సిపల్ పరిధిలోని మారుతీ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరుతున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం నిర్వహించే సభకు పెద్ద ఎత్తున అభిమానులు, బీజేపీ నేతలు, నాయకులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వ బడుల్లో మరమ్మతులు పూర్తి చేయాలి



జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదులు, టాయిలెట్లు మరమ్మతులు, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతులపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులపై కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏజెన్సీలను నియమించాలన్నారు. ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులు గుర్తించాలన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాఠశాలల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న 'గాసా' సభ్యులు



వినతిపత్రం అందజేత

అల్వాల్: గ్రేటర్ అల్వాల్ అలైడ్ సర్వీస్ అసోసియేషన్ (గాసా) సభ్యులు ప్రొఫెసర్ కోదండరాంను శనివారం కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎంఎంటీఎస్ కోసం రైల్వేశాఖకు రావాల్సిన రూ.381 కోట్లు విడుదల చేసేలా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడాలని వారు కోరారు. సికింద్రాబాద్, మల్కాజిగిరి, అల్వాల్ మీదుగా మేడ్చల్ వరకు ఫ్రీక్వెన్సీ పెరుగుతుందన్నారు. ఓల్డ్ అల్వాల్ ప్లే గ్రౌండ్ తరఫున గత ప్రభుత్వం ప్రైవేటైజ్ చేసిన లీజ్ అగ్రిమెంట్‌ను రద్దు చేయించాలని కోరుతూ.. ఆయనకు వినతి పత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. 'గాసా' ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌వర్మ, బీటీ.శ్రీనివాస్, శివరాముడు, అల్వాల్ జేఏసీ సురేందర్‌రెడ్డి, పలు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఘట్‌కేసర్: బొక్కొనిగూడ అభయాంజనేయ స్వామి ఆలయంలో అభయాంజనేయ స్వామి, నవగ్రహ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, శాంతి కల్యాణం, అన్నదానం చేశారు. మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనిత, మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలు యాప్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్, బీజేపీ రూరల్ జిల్లా విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షయ స్కూల్ ఎదుట తల్లిదండ్రుల నిరసన



స్కూల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఘట్‌కేసర్: అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ చౌదరిగూడ అక్షయ ఇంటర్నేషనల్ స్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు బైఠాయించి శనివారం నిరసన చేపట్టారు. ప్రతి సంవత్సరం తప్పనిసరిగా స్కూల్ డ్రెస్ కొనుగోలు చేయాలని, ఫీజులు ఆలస్యంగా చెల్లించిన వారు ఫైన్ చెల్లించాలనడం, లేదంటే టీసీ తీసుకొని వెళ్లిపోవాలని యాజమాన్యం బెదిరించడం అన్యాయమని ప్రిన్సిపల్‌కు అందజేసిన లేఖలో తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యాధికారులు స్పందించి స్కూల్ యాజమాన్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై స్కూల్ ప్రిన్సిపల్ స్వప్నను వివరణ కోరగా తల్లిదండ్రుల ఆరోపణలు అవాస్తవమని, అన్ని విషయాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ముందే వివరించామన్నారు.

మల్కాజిగిరిలో బీజేపీ విజయం ఖాయం



మాట్లాడుతున్న ఈటల రాజేందర్



హాజరైన కార్యకర్తలు, నేతలు

రామంతాపూర్: లింగారెడ్డి గార్డెన్‌లో శనివారం మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఉప్పల్ నియోజకవర్గ బూత్ కన్వీనర్లు, కార్యకర్తల సమ్మేళనానికి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీ విజయం ఖాయమని, దేశం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందంజలో ఉందంటే అంతర్జాతీయ స్థాయిలో శాసించే స్థానంలో ఉన్నామంటే అందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కారణమన్నారు. దేశంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు సాధించే రికార్డు గెలుపు ఖాయమన్నారు. బీజేపీకి కార్యకర్తలే పెద్ద బలం బలగమన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రధానమంత్రి మోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రచారం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ బీఆర్ఎస్‌కు కాలం చెల్లిందని, అదేవిధంగా నమ్మి ఓట్లు వేసినందుకు ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్ పని కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఖతమవుతుందన్నారు. మల్కాజిగిరిలో వికసించేది కమలమే అన్నారు. అదేవిధంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ ఈటల రాజేందర్ పేరు ప్రకటించగానే బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో గుండెల్లో రైళ్లు పరుగెత్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్‌తో పాటు రామంతాపూర్, హబ్సిగూడ కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కక్కిరేణి చేతన హరీష్, గోలి మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, పద్మారెడ్డి, సతీష్‌కుమార్, గొరిగే కృష్ణ, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

మల్లాపూర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున పిలుపునిచ్చారు. మల్లాపూర్ ఎస్ఎల్ ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో మల్లాపూర్ డివిజన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగాగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. మోదీ చేసిన అభివృద్ధిని ఇంటింటికీ తిరిగి తెలియజేస్తూ.. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసేలా ప్రచారం చేయాలన్నారు. బూత్‌స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శిల్పారెడ్డి మట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి తప్పా.. అభివృద్ధి లేదని విమర్శించారు. మోదీ ప్రధాని అయ్యాకే దేశం అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో కుడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత పథకాలను పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, బోదాసు మాధవి, సుజాత, నిర్మల, అనితారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, ఆంజనేయులు, రాములు నాయక్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల జమున

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 | 9912220571
9912225470 | 9505507657